క్లుప్తంగా

క్రీడాకారిణికి ఆర్థికసాయం



రూపాదేవిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రాజాం సిటీ: జాతీయ పారా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పడాల రూపాదేవికి మండలంలోని పాగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఆర్థికసాయం చేశారు. సెప్టెంబరు 12వ తేదీన ఇండోనేషియాలో జరగనున్న అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనేందుకు సదరు క్రీడాకారిణి దాతల సహాయం కోరింది. ఈ మేరకు స్పందించిన ఉపాధ్యాయులు రూ.40 వేలను సమకూర్చి, ఆమెకు గురువారం పాఠశాలలో అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు సత్యారావు మాట్లాడుతూ రూపాదేవిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆమె పుట్టినరోజును పురస్కరించుకుని, మొక్కను బహూకరించి సన్మానించారు. కార్యక్రమంలో స్టాఫ్ కార్యదర్శి బి.శ్రీనివాసరావు, వల్లూరు దాలినాయుడు, పి.అజయ్‌కుమార్, ఆర్.రామకృష్ణ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

బొబ్బిలి: మహిళలకు ఇస్తున్న స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని హిందుస్థాన్ పెట్రోలియం డీజీఎంలు సంజీవ్‌కుమార్, మురళీకృష్ణ కోరారు. స్థానిక సూర్య రెసిడెన్సీలో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం ముగింపు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న పలువురు మహిళలకు ధ్రువపత్రాలు అందజేశారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన మహిళలకు గ్యాస్‌స్టవ్, గృహోపకరణాలను బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ప్రత్తి శ్రీనివాస్, ఏరియా సేల్స్ మేనేజర్ కె.శ్రీహర్ష, డిస్ట్రిబ్యూటర్లు జలగం ప్రసాదరావు, పెంటపాటి సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా మధ్యాహ్న భోజన పథకం నిర్వహించాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా నిర్వహించాలని ఎంఈవో త్రినాథరావు సూచించారు. గురువారం స్థానిక రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన.. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు, విద్యార్థుల హోమ్‌వర్క్ పుస్తకాలు, అభ్యసన సామర్థ్యాలు, ఉపాధ్యాయుల లెస్సన్ ప్లాన్‌లు, డైరీలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని ఆర్‌వో ప్లాంట్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వంటకాలు వండిపెట్టాలన్నారు. మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు అందుబాటులో తాగునీటి సౌకర్యం ఉండాలన్నారు.

అక్రమంగా విద్యుత్ వినియోగంపై దాడులు

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామం వద్ద అక్రమంగా విద్యుత్ వినియోగం జరుగుతుండడంపై విద్యుత్ శాఖ అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ నెల 1వ తేదీన విద్యుత్ చౌర్యం అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తా కథనానికి అధికారులు స్పందించారు. డివిజనల్ ఆపరేషన్ ఈఈ డి.సురేష్, రాజాం ఏడీఈ బి.వి.ఎన్.ఫణీంద్రకుమార్, ఏఈ సురేష్‌కుమార్‌లు అంతకాపల్లి పంటపొలాల్లో తనిఖీలు నిర్వహించారు. ఓ పంట పొలంలో రామినాయుడు అనే వ్యక్తి విద్యుత్ స్తంభం నుంచి అక్రమంగా తీసుకువచ్చిన విద్యుత్ సాయంతో మోటారును వినియోగించడంపై పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఏడీఈ తెలిపారు. ఈ మేరకు సంబంధిత వ్యక్తికి అపరాధ రుసుం కూడా విధించామన్నారు. అక్రమ విద్యుత్ కనెక్షన్ తొలగించామన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మణ్

రామభద్రపురం: సస్యరక్షణ చర్యలతో పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.లక్ష్మణ్, అదనపు శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఎం.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొండకెంగువ గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు పంటల్లో సస్యరక్షణ చర్యలపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. పంట వేసే ముందు విత్తనశుద్ధి ప్రధానమని, అలాగే నేలసారాన్ని బట్టి పంట వేసుకోవాలని తెలిపారు. ఏ నేల ఏ పంటకు అనువైనదో పరీక్షించుకుని, వేసుకుంటే ఫలసాయం బాగుంటుందన్నారు. వరినారును కూడా శుద్ధి చేసుకుని, ఆ తర్వాత నాటుకోవాలని, నాటేటప్పుడు కూడా నారు చివర్లు తొలగించి నాటుకోవాలన్నారు. తద్వారా పంటకు చీడపీడలు, తెగుళ్లు సోకవని, పంట ఏపుగా పెరుగుతుందన్నారు. మరింత సమాచారం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 18004198800ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి జి.తిరుమలరావు, వీఏఏ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే అమృతం

- తల్లిపాల వారోత్సవాల్లో ఐసీడీఎస్ అధికారులు



రాజాం: తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న ఐసీడీఎస్ పీవో కనకదుర్గ

రాజాం: తల్లిపాలు బిడ్డకు అమృతం వంటిది అని, అప్పుడే పుట్టిన శిశువుకు కనీసం ఆరు నెలల పాటు తల్లిపాలే ఇవ్వాలని ఐసీడీఎస్ రాజాం పీవో టి.కనకదుర్గ సూచించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో గురువారం సమావేశమైన ఆమె.. తొలుత తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తల్లిపాల ఆవశ్యకతను ప్రతీ బాలింతకు వివరించాలన్నారు. తల్లిపాలు తీసుకుంటేనే బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదల బాగుంటుందన్న విషయం తెలియజేయాలన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు జరిగే ఈ వారోత్సవాల్లో తల్లిపాల వల్ల బిడ్డకు కలిగే ప్రయోజనాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌జీవో లక్ష్మీనారాయణ, ప్రోగ్రాం అసిస్టెంట్ లక్ష్మి, ఐసీడీఎస్ సెక్టార్ల సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో తల్లిపాల వారోత్సవాలు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు చలమయ్య, రీనాచౌదరిలు తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని, ప్రతీ బాలింత తన బిడ్డకు తప్పనిసరిగా కొన్నాళ్లపాటు పాలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవో రాధాకృష్ణ, సావిత్రి, సాయికృష్ణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రేగిడి: ర్యాలీలో బూరాడ పీహెచ్‌సీ సిబ్బంది


బొబ్బిలి రూరల్: తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకుని, మండలంలోని శివడవలస గ్రామంలో అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై.రాజు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యాన్నిస్తుందని, పుట్టిన ప్రతీ బిడ్డకు ఆరు నెలల పాటు తప్పనిసరిగా తల్లిపాలే ఇవ్వాలన్నారు. బిడ్డ సంపూర్ణ ఆరోగ్యానికి మనవంతు బాధ్యతగా ప్రతీ తల్లి తన పాలు ఇవ్వాలన్నారు. అనంతరం బాలింతలు, పిల్లల తల్లులతో సమావేశమై తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం వల్ల బిడ్డలో వచ్చే ఆరోగ్యకరమైన మార్పులను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి రూరల్: బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్

'సూపర్ సిక్స్' అమలు చేయాల్సిందే..

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



భీమయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరిట కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందేనని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. ఇదే విషయమై స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నిధులు లేవనే సాకు చూపి సూపర్ సిక్స్ హామీలను ఎగ్గొట్టేందుకు సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో పూర్తి బడ్జెట్ ప్రవేశపెట్టకుండా ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఆర్డినెన్స్ జారీ చేయడం వెనక అసలు రహస్యం హామీలు ఎగ్గొట్టడానికేనని దుయ్యబట్టారు. ఏ పథకం ఇవ్వకుండా తప్పించుకోవాలని ప్రయత్నిస్తే ప్రజలు తిరగబడే రోజులొస్తాయన్నారు. నమ్మి ఓట్లు వేసిన ప్రజలను మోసం చేయడం తగదన్నారు. అనంతరం ఆరికతోటలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, సర్పంచ్ ప్రతినిధి పెంకి భీమయ్యను పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడొద్దని అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, నియోజకవర్గం జేసీఎస్ కన్వీనర్ శంబంగి వేణుగోపాలనాయుడు, మండల జేసీఎస్ చింతల సింహాచలంనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయులు, వైస్ ఎంపీపీ ప్రతినిధి పెంకి శేఖర్ బాబు, మండల ఉపాధ్యక్షుడు దర్రు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

'సుప్రీం' తీర్పు రాజ్యాంగబద్ధంగా లేదు..

బొబ్బిలి: ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగబద్ధంగా లేదని అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య, అధ్యక్ష, కార్యదర్శులు కొలు చిరంజీవులు, బొక్కేన రాములు అభిప్రాయపడ్డారు. ఇదే విషయమై వారు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని ఇదే సుప్రీంకోర్టు గతంలో తీర్పునిచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ వర్గీకరణ చేసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని ఎలా చెబుతారని, ఇందులో ఏదో కుట్ర దాగి ఉందన్నారు. ఒకవేళ ఎస్సీ వర్గీకరణ గానీ చేయాల్సి వస్తే కులగణన చేపట్టిన తర్వాత శాస్త్రీయబద్ధంగా చేయాలన్నారు. లేకపోతే మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. రాజ్యాంగంలోని 332 అధికరణం ప్రకారం వర్గీకరణ చెల్లదన్నారు. ఇది కేవలం ఓట్ల కోసం రాజకీయ పార్టీలు ఆడుతున్న నాటకాల్లా ఉన్నాయన్నారు.


చెరకు సాగులో మెలకువలు పాటించాలి



రైతులకు సలహాలిస్తున్న శాస్త్రవేత్త రాజేశ్వరి

రాజాం: చెరకుపంట సాగులో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయని సంకిలి ఈఐడీ ప్యారీ ఇండియా చక్కెర కర్మాగారం డీజీఎమ్(కేన్) రమేష్ తెలిపారు. స్థానిక పట్టణంలోని శ్రీవేంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో సంకిలి ఈఐడీ ప్యారీ ఇండియా ఆధ్వర్యంలో రాజాం డివిజన్ పరిధిలోని చెరకు రైతులకు చెరకుసాగుపై గురువారం అవగాహన కల్పించారు. సాగులో సకాలంలో ఎరువుల వినియోగం, కలుపు నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. దూరపు సాళ్ల పద్ధతి పాటిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. ఆర్ అండ్‌డీ శాస్త్రవేత్త డాక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ నూతన వంగడాల రూపకల్పన, జీవన నియంత్రణ కీటకాలు సరఫరా చేసి దిగుబడులు పెంచడంపై పలు సూచనలు, సలహాలు చేశారు. ఆర్‌అండ్ డీ మేనేజర్ రామచంద్రన్ మాట్లాడుతూ చెరకు సాగులో యాజమాన్య పద్ధతులు వివరించారు. ఈఐడీ జోనల్ మేనేజర్ కమలపట్నాయక్, మురళి, విజన్ ఇన్‌చార్జ్ ఎస్.కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి



తెర్లాం రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని, ఆ దిశగా ప్రధానోపాధ్యాయులంతా చర్యలు చేపట్టాలని ఎంఈవో జె.త్రినాథరావు సూచించారు. స్థానిక రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో కలిసి గురువారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేయడంతో పాటు, ఓటర్ల జాబితాను పాఠశాలలోను, గ్రామ పంచాయతీ, సచివాలయాల్లోనూ ప్రదర్శించాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియను సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత హెచ్‌ఎంలదేనన్నారు. ఈ నెల 8వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నిక నిర్వహించి, మధ్యాహ్న 3 గంటలలోగా ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ఎన్నిక పూర్తి చేసి వారితో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు.

రేగిడి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 8వ తేదీన పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంఈవో ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు ప్రతీ పాఠశాలలో ఎన్నికల నోటిఫికేషన్, ఓటర్ల జాబితాను ప్రదర్శించాలన్నారు. ఈ నెల 5వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు.

సన్మానం




తిరుమలరావును సత్కరిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు

రామభద్రపురం: బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు ఇటీవల ఉద్యోగ విరమణ పొందడంతో మండలంలోని బూసాయవలసలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆయనను మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు బుధవారం రాత్రి సన్మానించారు. అనంతరం వారు సీఐగా తిరుమలరావు చేసిన సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో నియోజకవర్గం జేసీఎస్ కన్వీనర్ శంబంగి వేణుగోపాలనాయుడు, బొబ్బిలి, గజపతినగరం, విజయనగరం వన్ టౌన్, స్పెషల్ బ్రాంచ్ సీఐలు ఎం.నాగేశ్వరరావు, ఎన్.వి.ప్రభాకరరావు, బి.వెంకటరావు, ఇ.నర్సింగమూర్తి, రామభద్రపురం, బాడంగి, తెర్లాం ఎస్ఐలు జ్ఞానప్రసాద్, ఆర్.జయంతి, ఆర్.మహేష్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



రాజాం: పాగిరిలో పింఛన్ నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్



బొబ్బిలి రూరల్: పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే బేబీనాయన

రాజాం/వంగర/బొబ్బిలి రూరల్/రామభద్రపురం/తెర్లాం: మండలాల్లోని అన్ని గ్రామాల్లో సామాజిక పింఛన్ల పంపిణీ గురువారం జరిగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని, లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు. రాజాం మండలంలో 96 శాతం, బొబ్బిలి, రామభద్రపురం మండలాల్లో 97 శాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు ఆయా మండలాల ఎంపీడీవోలు తెలిపారు.

లబ్ధిదారులను ఇబ్బంది పెట్టొద్దు



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి: స్థానిక టిడ్కో ఇళ్ల లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేయవద్దని ఎమ్మెల్యే బేబీనాయన అధికారులకు సూచించారు. స్థానిక కోటలోని తన నివాసంలో మున్సిపల్, ఇంజినీరింగ్, బ్యాంకు అధికారులతో గురువారం సమావేశమైన ఆయన టిడ్కో ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. పట్టణంలోని 276 టిడ్కో ఇళ్లకు సంబంధించి, బ్యాంకర్లు ఇచ్చిన రూ.6.25 కోట్ల రుణాల మారటోరియం గడువు దాటి రెండేళ్లు కావస్తున్నందున వాయిదాల చెల్లింపులో ఆలస్యమైతే లబ్ధిదారులకు ఫోన్లు చేసి మరీ ఇబ్బందులు పెట్టవద్దన్నారు. బకాయిపడ్డ మొత్తాల గురించి త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడుతామన్నారు. లబ్ధిదారులకు ఇళ్లను అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టిడ్కో ఈఈ జ్యోతి, మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చీరల వితరణ

బొబ్బిలి రూరల్: మండలంలోని రాజచెరువువలస గిరిజన గ్రామంలోని 50 మంది నిరుపేద వృద్ధ మహిళలకు వనమిత్ర కృష్ణదాస్ మాస్టారు తన సొంత నిధులతో గురువారం చీరలు వితరణ చేశారు. తనకు తోచిన సాయం చేయడంలో చాలా సంతృప్తి ఉందని దాత ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ధూపం వాసు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యనందించాలి

వంగర: విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఎంఈవో వై.దుర్గారావు సూచించారు. మండలంలోని మగ్గూరు ఎయిడెడ్ పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. అక్కడి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, రికార్డుల నిర్వహణ, మధ్యాహ్న భోజనం వంటకాలను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు గమనించారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వంటకాలు చేయించి, రుచి, శుచికరమైన భోజనాలను విద్యార్థులకు పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎన్.జగన్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు

ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం



ఆక్రమిత చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీను

బొబ్బిలి రూరల్: ప్రభుత్వ స్థలాలు, చెరువులను ఆక్రమించుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం.శ్రీను హెచ్చరించారు. మండలంలోని ఎం.బూర్జివలస గ్రామంలో చెరువు కబ్జాకు గురైన ప్రాంతాన్ని ఆయన గురువారం పరిశీలించారు. సర్వే నంబరు 16–2లోని వేపూరి వెంకటపతిరాజు చెరువు విస్తీర్ణంపై పూర్తి సమాచారాన్ని సర్వేయరు ద్వారా తెలుసుకున్నారు. అక్కడ రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించి మరీ ఆక్రమణదారులు నిర్మాణాలకు ఉపక్రమించడంతో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఆయన స్వయంగా అక్కడికి వెళ్లి, పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు, స్థలాలు, చెరువుల కబ్జాలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఇక్కడ ఉద్దేశపూర్వకంగానే అక్రమణలకు పాల్పడుతున్నారని, ఎలాంటి వారిపైనా అయినా చర్యలకు వెనకాడేది లేదన్నారు. అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారి వివరాలు తెలుసుకుని, నోటీసులు జారీ చేయాలని సిబ్బందికి సూచించామన్నారు. రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ ఆక్రమణలు జరిగినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయన వెంటన ఆర్ఐ కల్యాణ చక్రవర్తి, తదితరులు ఉన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు



రేగిడి: చాటాయివలసలో వరినారు చివర్లు తొలగిస్తున్న రైతులు

రేగిడి: వరినాట్లు వేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని ఏవో జి.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని చాటాయివలస, అక్కన్నఅగ్రహారం, లక్ష్మీపురం గ్రామాల్లో వరినాట్లు వేసే పొలాలను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాట్లు వేసేటప్పుడు నారు చివర్లు తొలగించి, వేసుకోవాలని సూచించారు. అలాగే కాలిబాటలు ఉండేలా చూసుకోవాలన్నారు. తద్వారా పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి ఏపుగా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, కూనిబిల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: వరినాట్లు వేసేటప్పుటు నారు మొక్కకు నారుమొక్కకు మధ్య తగిన దూరం ఉండేలా చూడాలని ఏవో శ్యామసుందర్ తెలిపారు. మండలంలోని అలజంగి గ్రామంలో వరినాట్లు వేస్తున్న పంటపొలాలను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. వరుస పద్ధతిలో వరినాట్లు వేసుకుంటే పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి పంట బాగా పండుతుందన్నారు.

వంగర: మండలంలోని కొప్పర గ్రామ పొలాల్లో జరుగుతున్న వరిఊబాలు, నారుతీత పనులను వీఏఏ పెంట శివసాయి పరిశీలించారు. అనంతరం రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. వరిసేద్యంలో పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని, నాట్లు వేసేటప్పుడు నారు శుద్ధి చేసుకోవడంతో పాటు నారు చివర్లు తొలగించుకోవాలన్నారు. ఇలా చేయడం ద్వారా నారుమొక్కకు తెగుళ్లు, చీడపీడలు సోకవన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనే లక్ష్యం

- ఇంటింటా సర్వే చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది
- వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా చికిత్స
- సీఎల్‌టీఆర్ఐ డైరెక్టర్ ఆర్.వీరకుమారన్



మాట్లాడుతున్న సీఎల్‌టీఆర్ఐ డైరెక్టర్ వీరకుమారన్

రామభద్రపురం: కుష్టువ్యాధి నిర్మూలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని సీఎల్‌టీఆర్ఐ (సెంట్రల్ లెప్రసీ ట్రైనింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్)డైరెక్టర్ డాక్టర్ ఆర్.వీరకుమారన్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వారు గురువారం సందర్శించి, అక్కడి లెప్రసీ రోగులకు సంబంధించి రికార్డుల నిర్వహణను పరిశీలించారు. జూలై 18వ తేదీ నుంచి జరుగుతున్న లెప్రసీ ఇంటింటి సర్వేపై వైద్యాధికారులు దిలీప్‌కుమార్, శిరీషలను ఆరాతీశారు. అలాగే గ్రామంలో ఇప్పటికే గుర్తించిన లెప్రసీ రోగుల ఇంటికి వెళ్లి, వారిని పరిశీలించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లి, పిల్లల్లో కుష్టువ్యాధి లక్షణాలను గమనించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో లెప్రసీ రోగులు ఎక్కువ మంది ఉన్నట్లు గుర్తించామన్నారు. జిల్లాలో జరుగుతున్న సర్వేలో 4,275 మంది అనుమానితులను గుర్తించామని, వీరికి పూర్తిస్థాయి పరీక్షలు జరిపి వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా చికిత్స అందిస్తామన్నారు. ప్రతీ పదివేల మంది జనాభాలో ఒకటి కన్నా ఎక్కువ మంది కుష్టు వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి, వారికి పూర్తిస్థాయిలో వైద్యం అందిస్తే అంగవైకల్యం రాకుండా నిరోధించవచ్చన్నారు.

5 మచ్చలు పైబడిన వారికే పింఛన్!

ఇప్పటివరకు శరీరంపై రెండు లెప్రసీ మచ్చలు ఉంటే చాలు ప్రభుత్వం వారికి సామాజిక భద్రత పింఛన్ కింద రూ.3 వేలు అందజేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వారికి పింఛన్‌ను రూ.6 వేలకు పెంచడం వల్ల నిబంధనలను కఠినతరం చేసి ఐదు మచ్చలు పైబడి ఉన్న వారికి మాత్రమే కొత్తగా పింఛన్లు ఇవ్వడానికి నిర్ణయం తీసుకుందన్నారు. జిల్లాలో 740 మంది లెప్రసీ వ్యాధిగ్రస్తులకు పింఛన్ అందుతోందన్నారు. రెండు లెప్రసీ మచ్చలు ఉన్న వారికి పాసిబ్ బ్యాసిలరీ(పీబీ) విధానంలో ఆరు నెలలు, ఐదు మచ్చలు పైబడి ఉన్న వారికి మల్టీ బ్యాసిలరీ(ఎంబీ) విధానంలో 12 నెలల పాటు చికిత్స అందిస్తారన్నారు. ఇందులో భాగంగా నెలకు ఒకసారి ఆయా రోగుల ఇళ్లకు వెళ్లి, వైద్య సిబ్బంది మందులు అందజేస్తారన్నారు. సర్వేలో గుర్తించిన రోగులకు సకాలంలో వైద్యం అందించడంతో పాటు ఆ వ్యాధి ఉన్న వారి కుటుంబ సభ్యులకు వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పిస్తారన్నారు. వ్యాధిని సకాలంలో గుర్తిస్తే మెరుగైన వైద్యంతో నివారించవచ్చన్నారు. 1987 తర్వాత బహుళ ఔషధ చికిత్స (మల్టీ డ్రగ్ థెరపీ) ద్వారా వ్యాధిని అరికడుతున్నామన్నారు. ఈ వ్యాధికి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉంచి, ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ డాక్టర్ కె.కుమారెసన్, స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్, లెప్రసీ స్టేట్ కన్సల్టెంట్ కె సత్యవాణి, జిల్లా అధికారిణి కె.రాణి, డీపీఎంవో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

- పెన్షనర్ల రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఆర్.రామ్మూర్తినాయుడు

రామభద్రపురం: పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పెన్షనర్ల రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఆర్.రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మండల పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చింతల చిన్నమ్మతల్లి అధ్యక్షతన మండల పెన్షనర్ల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు గ్రాట్యుటీ పెంచాలని, 12వ పీఆర్‌సీ కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. అలాగే విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ బెనిఫిట్‌ను వెంటనే చెల్లించాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు చెల్లించాలన్నారు. పెన్షనర్లకు ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని, పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని, 12వ పీఆర్‌సీలో ఐఆర్ 40 శాతం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల పెన్షనర్ల సంఘం కార్యదర్శి ఎల్.రామకృష్ణ, సభ్యులు రామారావు, కృష్ణమూర్తి, తిరుపతిరాయుడు, రామారావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.